సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 4 । ఏప్రిల్ । 2024



మిర్చి ధరపై 'బైడగి' దెబ్బ !

తక్కువ ధరకు లభిస్తుండగా తేజా మిర్చి కంటే బైడగి మిర్చికే ఆయిల్ మిల్లుల యజమానులు ప్రాధాన్యం ఇస్తున్నారు. 10లో




..ఎంఎన్ఓ దురుసు ప్రవర్తన

వైద్యం కోసం వస్తే అశ్వారావుపేట సీహెచ్‌సీ ఎంఎన్ఓ దురుసుగా ప్రవర్తించాడని బాధితులు ఆరోపిస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
39°/ 23°

వాతావరణం

జిల్లాలో గురువారం మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రివేళ ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

కమనీయం.. కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో బుధవారం రామయ్య నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

బాధ్యతలు స్వీకరించిన బార్ అసోసియేషన్ కార్యవర్గం



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కొత్తగూడెంటౌన్: ఇటీవల ఎన్నికైన కొత్తగూడెం బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. కొత్తగూడెం కోర్టు సమావేశం మందిరంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా తోట మల్లేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా ఎమ్మెస్సార్ రవిచంద్ర, జాయింట్ సెక్రటరీగా సందుపట్ల ప్రవీణ్‌కుమార్, ట్రెజరర్‌గా అరకల కరుణాకర్, లైబ్రరీ సెక్రటరీగా ఎండీ సాదిక్‌పాషా, గేమ్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా దూదిపాల రవికుమార్, లేడీ రిప్రజెంటేటివ్‌గా నల్లమల్ల ప్రతిభ బాధ్యతలు స్వీకరించారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రేంజర్ శ్రీనివాసరావు స్మృతి వనం నిర్మిస్తాం

డీఎఫ్ఓ కిష్టాగౌడ్



అటవీ ప్రాంతంలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ కిష్టాగౌడ్

చంద్రుగొండ: విధి నిర్వహణలో గొత్తి కోయల చేతిలో అసువులు బాసిన దివంగత రేంజ్ అధికారి శ్రీనివాసరావు హత్యజరిగిన ప్రదేశంలో ఆయన పేరిట స్మృతి వనం నిర్మిస్తామని డీఎఫ్ఓ కిష్టాగౌడ్ తెలిపారు. చంద్రుగొండ రేంజ్ పరిధిలోని పోకలగూడెం బీట్, రావికంపాడు సెక్షన్‌లోని శ్రీనివాసరావు హత్యకు గురైన అటవీ ప్రాంతాన్ని బుధవారం సందర్శించి మాట్లాడారు. 25 ఎకరాల్లో స్మృతివనంతో పాటు ప్లాంటేషన్ పునరుద్ధరణ పనులు చేపడతామని తెలిపారు. వచ్చే జూలై, ఆగస్టు నెలల్లో ప్లాంటేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తగా పోడు పేరిట అడవులను నరికితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రేంజర్ ఎల్లయ్య, అటవీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి పరిశీలన

జూలూరుపాడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిని జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్ఓ) కిష్టాగౌడ్ బుధవారం పరిశీలించారు. సీతారామ ప్రాజెక్టు కెనాల్ నిర్మాణంతో పులుసుబొంత రిజర్వ్‌డ్ ఫారెస్ట్ భూమి కోల్పోవడంతో అటవీశాఖకు భూ బదలాయింపులో భాగంగా జూలూరుపాడు రెవెన్యూ గ్రామంలోని 250 సర్వేనంబర్‌లో ఉన్న సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. అటవీశాఖకు అప్పగించిన ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అటవీ, రెవెన్యూశాఖల జాయింట్ సర్వేను డీఎఫ్ఓ కిష్టాగౌడ్ పరిశీలించారు. ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు, ఎఫ్ఎస్ఓ హనుమంతు, ఎఫ్‌బీఓ బి నరసింహారావు, గిర్దావర్ తిరుపతిరావు, సర్వేయర్ శివ పాల్గొన్నారు.

శరవేగంగా రెండో వారధి

త్వరలోనే అందుబాటులోకి గోదావరిపై రెండో బ్రిడ్జి

- ఐదు నెలలుగా ఊపందుకున్న నిర్మాణ పనులు
- అంతకుముందు ఎనిమిదిన్నరేళ్లు నత్తనడకన నిర్మాణం
- నేటితో బ్రిడ్జికి శంకుస్థాపన చేసి తొమ్మిదేళ్లు పూర్తి



తుది దశకు చేరుకున్న గోదావరి రెండో బ్రిడ్జి నిర్మాణ పనులు

బూర్గంపాడు: దశాబ్దకాల నిరీక్షణకు తొందరలోనే తెరపడనుంది. సారపాక, భద్రాచలం మధ్య గోదావరి నదిపై నిర్మిస్తున్న రెండో బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. బ్రిడ్జి సిమెంట్ కాంక్రీట్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. రెండు నెలల నుంచి అప్రోచ్ రోడ్డు పనులు మరింతగా ఊపందుకున్నాయి. ఇదే ఒరవడి కొనసాగితే త్వరితగతిన రెండో వారధిని ప్రారంభించుకునే అవకాశం ఉంది.

15 ఏళ్ల క్రితం ప్రణాళిక..

భద్రాచలం రామయ్య దర్శనానికి వచ్చే భక్తులు గతంలో బూర్గంపాడు మండలంలోని పాత గొమ్మూరు వద్ద మెట్లరేవు నుంచి కాలిదారిన నడుచుకుంటూ గోదావరి నీళ్ల వరకు వచ్చేవారు. అక్కడి నుంచి పడవలపై భద్రాచలం చేరుకుని రామయ్యను దర్శించుకునేవారు. 1953లో శ్రీరామనవమికి భక్తులు వస్తుండగా పడవలు మునిగి సుమారు వందమంది వరకు మృతిచెందారు. దీంతో నాటి పాలకులు గోదావరిపై బ్రిడ్జి నిర్మించాలని తలపెట్టారు. 1959 డిసెంబర్ 16వ తేదీన నాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఐదేళ్లలో నిర్మాణం పూర్తికాగా, అప్పటి ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు బ్రిడ్జి భద్రాచలంతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లే వాహనాల రాకపోకలకు వారధిగా మారింది. వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతుండటంతో పదిహేనేళ్ల క్రితం రెండో బ్రిడ్జి నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. ప్రతిపాదనలు, సాంకేతిక అనుమతులు పూర్తిచేసి 2015లో నిర్మాణ పనులు ప్రారంభించారు.

ఇటీవల పనులు వేగవంతం

బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ కూడా కొంతకాలం పనులు చేయకుండా నిలుపుదల చేసింది. తదుపరి అదే సంస్థ మిగతా పనులు చేపట్టింది. రెండేళ్లుగా పనులు ఊపందుకున్నాయి. పిల్లర్ల నిర్మాణం కొనసాగిస్తూనే బ్రిడ్జి పైకప్పు పనులు పూర్తి చేశారు. గత డిసెంబర్ నుంచి పనులు శరవేగంగా సాగుతున్నాయి. 2024 వేసవి నాటికి పనులు పూర్తిచేయాలనే కృతనిశ్చయంతో నేషనల్ హైవే అధికారులు చర్యలు చేపట్టారు. రెండు నెలల క్రితం ప్రారంభించిన బ్రిడ్జి అప్రోచ్ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. బ్రిడ్జి అప్రోచ్‌కు వందల లారీల మట్టి అవసరం కాగా, మట్టి లభ్యత పనులకు ప్రతిబంధకమవుతుందని అందరు భావించారు. ఎన్‌హెచ్ అధికారులు ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ఇరిగేషన్ శాఖ అధికారుల అనుమతితో సీతారామా కెనాల్ కోసం తవ్విన మట్టిని బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుకు తోలుతున్నారు. దీంతో కేవలం నెల రోజుల్లోనే అప్రోచ్ మట్టి పనులు పూర్తయ్యాయి.

పూర్తి కావొచ్చిన అప్రోచ్ రోడ్డు పనులు

భద్రాచలం, సారపాక రెండు వైపులా బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పనులు తుదిదశకు చేరుకున్నాయి. సారపాక వైపు అప్రోచ్‌రోడ్డుకు అడ్డుగా ఉన్న గుడిసెలను రెవెన్యూశాఖ అధికారుల సహకారంతో తొలగించారు. వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం మట్టిరోడ్డుపై రోలింగ్ చేసి చదును చేసే పనులు వేగంగా సాగుతున్నాయి. బ్రిడ్జిపై ఫుట్‌పాత్ పనులు, ఎలక్ట్రికల్ పనులు కూడా ఊపందుకున్నాయి. ఇదే రీతిలో పనులు కొనసాగితే తొందరలోనే బ్రిడ్జి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ లేకుంటే ఈ నెలలో జరగనున్న శ్రీరామనవమికి అమాత్యులతో బ్రిడ్జిని లాంఛనంగా ప్రారంభిస్తారనే ప్రచారం కూడా సాగింది. అయితే ఎన్నికల కోడ్‌తో పాటుగా పూర్తిస్థాయిలో పనులు కాకపోవటంతో మూడు నెలలు ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

2015లో ఇదే రోజున శంకుస్థాపన

గోదావరిపై రెండో బ్రిడ్జి నిర్మాణానికి 2015, ఏప్రిల్ 4వ తేదీన అప్పటి కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. తొమ్మిదేళ్లపాటు ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగాయనే చెప్పాలి. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా తొలుత గోదావరిలో పిల్లర్ల నిర్మాణ పనులు చేపట్టారు. నదిలోని రాళ్ల గుట్టలను పగులగొట్టి పిల్లర్ల నిర్మాణానికి చాలా సమయం పట్టింది. గోదావరి వరదలు కూడా నిర్మాణ పనులకు ఒకింత ఆటంకంగా మారాయి. సారపాక వైపున రెండు, మూడు పిల్లర్ల నిర్మాణంలో సాంకేతిక అభ్యంతరాలు వ్యక్తం కావటంతో వాటిని తొలగించి కొత్త నిర్మాణాలు చేపట్టారు. గోదావరి వరదలతో ఏటా ఐదు నెలలపాటు మాత్రమే పనులు సాగుతూ వచ్చాయి.

పనులు సాగుతున్నాయి

రెండో బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. బ్రిడ్జిపై ఫుట్‌పాత్, ఎలక్ట్రికల్ పనులు మొదలయ్యాయి. మరోపక్క అప్రోచ్ రోడ్డు పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. సాధ్యమైనంత తొందరగా బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– శైలజ, నేషనల్ హైవే, డీఈ

'సంప్రదాయం'పైనే మక్కువ

- ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపని రైతులు
- ప్రకృతి వైపరీత్యాలతో ఆర్థికంగా నష్టపోతున్న కర్షకులు



లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెంలో వరిసాగు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతులు ఆర్థిక పరిపుష్టి సాధించేలా ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. సంప్రదాయ పంటలు వరి, మొక్కజొన్న, జొన్న, వేరుశెనగ, వాణిజ్య పంటలు పత్తి, మిర్చి వైపే కర్షకులు మొగ్గు చూపుతున్నారు. విత్తనం నాటింది మొదలు పంట దిగుబడి వచ్చే వరకు నమ్మకం లేని పరిస్థితుల్లో ఆరుగాలం కష్టపడి పంటలను పండిస్తున్నారు. దిగుబడులు మాట ఎలా ఉన్నా నకిలీ విత్తనాలు, చీడపీడలు ఆశించడంతోపాటు ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు దివాళా తీస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ కూలీలుగా మారుతున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల వైపు దృష్టి సారించాలని, కూరగాయలు, ఆకు కూర సాగుతో లాభాలను పొందాలని, ప్రకృతి వైపరీత్యాలతో నష్టం జరగని ఆయిల్‌పామ్ సాగు చేయాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులు అవగాహన పెంపొందిస్తున్నా.. ఆచరణలో ఫలితాలు సాధించలేకపోతున్నారు. ఆయిల్‌పామ్ సాగులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుస్తోంది. ఉద్యాన పంటల్లోనూ ప్రథమ స్థానంలోనే ఉంది. ఇక మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పప్పు ధాన్యాల సాగుపై రైతుల్లో విముఖత వ్యక్తమవుతోంది.

యాసంగిలో తగ్గిన పంటల సాగు విస్తీర్ణం

ఈసారి యాసంగిలో గత యాసంగి సీజన్ కంటే జొన్న, మొక్కజొన్న మినహా అన్ని పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. సీజన్ ఆలస్యంగా ప్రారంభం కావడం ఇందుకు ఒక కారణంగా చెప్పవచ్చు. పెసర సాధారణ విస్తీర్ణం 1,428 ఎకరాలు కాగా కేవలం 436 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. కంది పంట కేవలం మూడెకరాల్లో మాత్రమే వేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. గతంలో పొద్దు తిరుగుడు సాగు పెరగగా, ఈసారి తగ్గింది. 514 ఎకరాల్లో సాగు చేస్తారనే అంచనా వేయగా, కేవలం 179 ఎకరాల్లో మాత్రమే సాగు చేపట్టారు. ఉలవలు, చెరకు, మినుము తదితర పంటల సాగు విషయం చెప్పనక్కర్లేకుండా పోయింది. కూరగాయలకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నప్పటికీ వాటి సాగుకు రైతులు మక్కువ చూపడం లేదు. సంప్రదాయ పంటలు వేసిన సందర్భంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు 33 శాతం కంటే ఎక్కువ నష్టం జరిగితేనే పంటనష్ట పరిహారం ఇవ్వాలనే నిబంధన ఉంది. దీంతో పంటలు దెబ్బతిన్న సన్న, చిన్న కారు రైతులు పరిహారం పొందలేకపోతున్నారు. నష్టాలు చవి చూడటంతోపాటు ఒక్కోసారి పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో రైతులు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు వ్యవసాయ, ఉద్యాన శాఖలతోపాటు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో సమష్టి కార్యాచరణతో అవగాహన కల్పించాల్సి ఉంది. ప్రత్యామ్నాయ పంటలతో ఒనగూరే లాభాలను విశదీకరించాల్సిన అవసరం ఉంది. దీని వల్ల జిల్లా ప్రజలకు అవసరమైన పంట దిగుబడులు ఇతర ప్రాంతాల నుంచి రావాల్సిన అవసరం కూడా తగ్గుతుంది. రైతులు కూడా ఆర్థికంగా బలోపేతమవుతారు.

కొనుగోళ్లు సరిగా ఉండవు



వరి, మిర్చి,పత్తి, మొక్కజొన్న మాదిరి ప్రభుత్వం నుంచి ఇతర పంటల కొనుగోళ్లు ఎక్కువ ఉండవు. బహిరంగ మార్కెట్‌కు వెళితే ధర తక్కువకు అడుగుతారు. దీంతో నష్టమైనా, లాభమైనా సంప్రదాయ పంటలే వేస్తాం. కొనుగోలుకు ప్రభుత్వం నుంచి భరోసా వస్తే అప్పుడు ధైర్యంగా ఇతర పంటలు సాగు చేస్తాం.

–కల్తీ ముత్తయ్య, గుండాల

7న 'మోడల్' ప్రవేశ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్ : తెలంగాణ మోడల్ స్కూళ్లలో ఆరు, పది తరగతుల్లో ప్రవేశాలకు ఈనెల 7న పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ సోమశేఖర శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులను గంట ముందు నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



5కే రన్‌లో పరుగెడుతున్న కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజు తదితరులు

- కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల
- ఐ ఓట్ ఫ్యూర్ నినాదంతో 5కే రన్



కొత్తగూడెంలో 5కే రన్‌లో పాల్గొన్న యువతీయువకులు

కొత్తగూడెంటౌన్: దేశంలో ప్రతీ ఒక్కరికి సమాన విలువ కలిగింది ఓటు మాత్రమేనని, అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రియాంక ఆల పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో 5కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ రోహిత్‌రాజు జెండా ఊపి ప్రారంభించారు. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ నుంచి సూపర్‌బజార్, రైల్వే స్టేషన్ మీదుగా లక్ష్మీదేవిపల్లి వరకు 5కే రన్ సాగింది. తొలుత కలెక్టర్ మాట్లాడుతూ 2024 ఈనెల 1వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన వారంతా, ఈ నెల 14 వరకు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని, నూతన ఓటరు కార్డు పొందాలని అన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు కళాజాతాలతో ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నామని తెలిపారు. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో అర్హులందరూ ఓటేయాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో స్వీప్‌లో భాగంగా వాక్ టూ పోలింగ్ బూత్, ఓటు వినియోగం ప్రాధాన్యత ప్రాముఖ్యత తెలియజేసేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్లు ఓటు వేసేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, ఏఆర్ఓ కాశయ్య, జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్, జిల్లా క్రీడలశాఖ అధికారి (డీవైఎస్‌వో) పి.పరందామరెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రసూనారాణి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, తూనికలు కొలతల అధికారి మనోహర్, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి సంజీవరావు, జిల్లా పరిపాలనాధికారి గన్యా, ఎన్నికల సూపరింటెండెంట్లు దారా ప్రసాద్, రంగాప్రసాద్, వివిధ శాఖల అధికారులు, యువజన సంఘాలు, క్రీడా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటికే రామయ్య తలంబ్రాలు..

- ఆర్టీసీ లాజిస్టిక్ సేవల ద్వారా పంపిణీ
- అన్ని బస్టాండ్లలో బుకింగ్‌కు వెసులుబాటు
- రూ.151తో ఈ నెల 18వ తేదీ వరకు అవకాశం



తలంబ్రాలు కలుపుతున్న ఈఓ, భక్తులు(ఫైల్)

చుంచుపల్లి: శ్రీసీతారామ చంద్రస్వామివారి కల్యాణ తలంబ్రాలను లాజిస్టిక్ సేవల ద్వారా అందించేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణం మహోత్సవం వైభవంగా జరగనుంది. ఈ వేడుకకు వెళ్లలేని భక్తుల కోసం రాష్ట్ర దేవాదాయశాఖ సహకారంతో ఆర్టీసీ ద్వారా నేరుగా ఇంటికే ముత్యాల తలంబ్రాలను పంపించనుంది. రాములవారి కల్యాణ తలంబ్రాలకు ఎంతో విశిష్టత ఉంటుంది. ఈ తలంబ్రాలను శుభకార్యాల్లో అక్షింతలుగా వాడితే వారికి సాక్షాత్తు రాములోరి అనుగ్రహం లభిస్తుందని భక్తులు విశ్వసిస్తుంటారు. ఈ నేపథ్యంలో గతేడాది మాదిరిగానే ఈసారి కూడా ఆర్టీసీ కార్గో సేవల ద్వారా భక్తులకు పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం రూ.151 చెల్లించి తమ వివరాలు నమోదు చేసుకోవాలి. గతేడాది తలంబ్రాల రుసుం రూ.116 ఉండగా, ఈసారి మరో రూ. 35 పెంచారు.

ఆర్టీసీ లాజిస్టిక్ కేంద్రాల్లో బుకింగ్

ఈ నెల 5 నుంచి 18వ తేదీ వరకు ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు ఏడు డిపోల పరిధిలో లాజిస్టిక్ కేంద్రాల ద్వారా తలంబ్రాల బుకింగ్‌కు అవకాశం కల్పించారు. రాములోరి తలంబ్రాల బుకింగ్ కోసం ఖమ్మం డిపో పరిధిలో (91542 98582, 91542 98583) మధిర (91542 98585), సత్తుపల్లి (91542 98585), కొత్తగూడెం (91542 98587, 91542 98599) మణుగూరు (91542 98588), భద్రాచలం (91542 98586), పాల్వంచ (93473 40036), ఇల్లెందు (83280 18525) నంబర్లలో భక్తులు సంప్రదించాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.కాగా తపాలా శాఖ కూడా తనవంతు రాములోరి తలంబ్రాలను స్పీడ్ పోస్టు ద్వారా భక్తులకు అందిస్తోంది.



తలంబ్రాలను భక్తులకు అందిస్తున్న సిబ్బంది (ఫైల్)

గతేడాది 5,022 బుకింగ్‌లు

గతేడాది రాములోరి కల్యాణం సందర్భంగా ఆర్టీసీ తలంబ్రాల బుకింగ్ సౌకర్యం అందుబాటులోకి తేగా ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఖమ్మం రీజియన్ ఆరు డిపోల పరిధిలో భద్రాద్రి తలంబ్రాల పంపిణీకి 5,022 బుకింగ్‌లు నమోదు కాగా, ఆర్టీసీకి రూ.5,82,552 ఆదాయం సమకూరింది. ఇందులో అత్యధికంగా 1,795 బుకింగ్‌ల ద్వారా సత్తుపల్లి డిపోకు రూ.2,09,220 ఆదాయం వచ్చింది. ఇక 1,123 బుకింగ్‌లతో ఖమ్మానికి రూ.1,30,268 రాబడి రాగా, 989 బుకింగ్‌లతో కొత్తగూడెం డిపోకు రూ.1,14,724 ఆదాయం సమకూరింది. అత్యల్పంగా మణుగూరు డిపోకు 317 బుకింగ్‌లతో కేవలం రూ.36,772 మాత్రమే ఆదాయం వచ్చింది.

సద్వినియోగం చేసుకోవాలి



రాములోరి కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ లాజిస్టిక్ సేవల ద్వారా అందజేస్తున్నాం. ఇందుకోసం అన్ని ఆర్టీసీడిపోల పరిధిలో బుకింగ్ కేంద్రాలను అందుబాటులో ఉంచుతున్నాం. భక్తులు రూ.151 చెల్లించి ఈ నెల 18వ తేదీలోగా బుక్ చేసుకోవాలి. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలి. –హరివర్మ, ఆర్ఎంఈ

రేగళ్లగుంపులో తీరనున్న తాగునీటి కష్టాలు

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని బచ్చువారిగూడెం గ్రామ పంచాయతీ పరిధి దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న వలస గొత్తికోయల గ్రామమైన రేగళ్లగుంపులో తాగునీటి కష్టాలు తీరనున్నాయి. సుమారు 20 ఏళ్లుగా ఈ గ్రామంలో కనీసం తాగునీటి బోరు కూడా లేదు. దీంతో ఆదివాసీలు అటవీ ప్రాంతంలోని వాగు చెలిమ నీటిపైనే ఆధార పడుతున్నారు. కాగా ఈ సమస్యపై గడిచిన మార్చి 18న 'సాక్షి' దినపత్రిక ప్రధాన సంచికలో 'గొంతెండుతోంది'శీర్షికక కథనం ప్రచురితంకాగా కలెక్టర్ ప్రియాంక ఆల, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ స్పందించిన విషయం విదితమే. తాజాగా రేగళ్లగుంపు ఆదివాసీలు కూడా సోమవారం భద్రాచలం ఐటీడీఏలో పీఓను కలిసి వినతి పత్రం అందించారు. దీంతో ఆ గ్రామంలో చేతి పంపు నిర్మించాలని పీఓ అధికారులను ఆదేశించగా, బుధవారం రేగళ్లగుంపు గ్రామాన్ని జియాలజిస్టు దామెదర్‌రెడ్డి, ఎంపీడీఓ జీ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సలీం సందర్శించారు. అనంతరం గ్రామంలో పలుచోట్ల పరిశీలించి, జియాలజిస్టు ఆధ్వర్యంలో బోరు పాయింట్లను గుర్తించి మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈ 'సాక్షి'తో మాట్లాడుతూ త్వరలోనే గ్రామంలో చేతి పంపు నిర్మిస్తామని, ఆదివాసీల తాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు.



చేతి పంపు ఏర్పాటుకు మార్కింగ్ చేస్తున్న అధికారులు

'టీజీ' కార్డులొచ్చేశాయ్..

ఖమ్మంక్రైం : వాహనదారులకు అందించే ఆర్‌సీ(రిజిస్ట్రేషన్), డ్రైవింగ్ లైసెన్స్ కార్డుల్లో టీఎస్‌కు బదులు టీజీగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం 20 రోజుల క్రితం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. కాగా, టీజీ పేరుతో ప్రింట్ చేసిన ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్ కార్డులు బుధవారం ఖమ్మం జిల్లా రవాణా శాఖ కేంద్రానికి చేరుకున్నాయి. అయితే 1,500 ఆర్‌సీ కార్డులు పంపిణీ చేయాల్సి ఉండగా 500 కార్డులు మాత్రమే వచ్చాయి. డ్రైవింగ్ లైసెన్స్ కార్డులు 1,500 వచ్చాయి. జిల్లాకు సరిపడా కార్డులు త్వరలోనే వస్తాయని, వాహనదారులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని సిబ్బంది చెబుతున్నారు.

క్లుప్తంగా

యువకుడి మృతిపై కేసు


వినీత్ మృతదేహం

చుంచుపల్లి: బాబూక్యాంపునకు చెందిన యువకుడు గుత్తుల వినీత్ (24) మృతి చెందిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 28 అర్ధరాత్రి 12 గంటల తరువాత ఆటోలో ప్రయాణిస్తున్న వినీత్ విద్యానగర్ మెయిన్‌రోడ్డుపై ఒక్కసారిగా దూకడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆయనకు స్థానికంగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ముందు ఖమ్మం ఆ తరువాత వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వినీత్ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఇదిలా ఉండగా తన మేనళ్లుడు వినీత్‌పై కొందరు దాడి చేయడంతోనే చనిపోయాడని ఆరోపిస్తూ మృతుడి మేనత్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న బాలుడిపై..

పాల్వంచ: అతి వేగంగా డ్రైవింగ్ చేస్తున్న బాలుడు, అతడి తండ్రిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఇందిరానగర్‌కాలనీకి చెందిన శ్రీనివాస్ కుమారుడు మోటార్ సైకిల్‌ను అతి వేగంతో నడుపుతుండటం, ముందు చక్రాలను పైకి ఎత్తి సర్కస్ ఫీట్లు కొడుతున్నట్లు గుర్తించిన పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, బాలుడు, అతడి తండ్రిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.రాము తెలిపారు.

చికిత్స పొందుతున్న యువతి మృతి

టేకులపల్లి: పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి బుధవారం మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని బోడు గ్రామానికి చెందిన కల్తీ శ్రీవల్లి (16) బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్తానంటే.. తల్లి వెళ్లొద్దంటూ మందలించింది. మనస్తాపానికి గురైన యువతి మంగళవారం పురుగులమందు తాగింది. గమనించిన కటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలిచారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు బోడు పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది.

ఇసుక ట్రాక్టర్ సీజ్

దమ్మపేట: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి రెడ్యాలపాడు గ్రామ శివారులో వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్లో లోడ్ చేసుకొని దమ్మపేట గ్రామానికి తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆ ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

మద్యం సీజ్

దమ్మపేట: అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన బెల్టు దుకాణంపై ఎఫ్ఎస్‌టీం, పోలీసులు సంయుక్తంగా దాడి చేసి కేసు నమోదు చేశారు. బుధవారం మండలంలోని నెమలిపేట గ్రామంలో బెల్టు దుకాణంలో మద్యం నిల్వలు ఉన్నాయనే సమాచారం పోలీసులకు అందింది. ఎఫ్ఎస్‌టీం అధికారి కృష్ణ, ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి కలిసి బెల్టు దుకాణంపై దాడి చేసి, అక్రమంగా నిల్వ ఉంచిన 168 క్వార్టర్ సీసాలు, 12 బీర్లను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. మద్యం విలువ రూ.36,264 ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు.

దివాలా పిటిషన్ దాఖలు

కొత్తగూడెంటౌన్: భద్రాచలానికి చెందిన వ్యాపారి ద్వారక సాయి బుధవారం న్యాయవాది ముత్యాల రాంచంద్రయ్య (కిశోర్) ద్వారా జిల్లా కోర్టులో 45 మందిపై సుమారు రూ.1.52 కోట్లకు దివాలా పిటిషన్ దాఖలు చేశారు. డిపార్ట్‌మెంట్ స్టోర్ యజమాని వనమా సుబ్బారావు, భద్రాచలానికి చెందిన గౌతమి స్పైసెలతో కలుపుకుని 45 మందిని ప్రతివాదులుగా చేర్చుతూ కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేసినట్లు న్యాయవాది బుధవారం తెలిపారు.

తప్పిన ప్రమాదం

గుండాల: పత్తి లోడుతో వెళ్తున్న ఓ లారీకి విద్యుత్ తీగలు అనుకుని మంటలు వ్యాపించాయి. డ్రైవర్లు అప్రమత్తం కావడంతో పెనుప్రమాదం తప్పింది. ఆళ్లపల్లి మండలం నుంచి కొత్తగూడెం వైపుగా లారీ పత్తి లోడుతో వెళ్తోంది. కాగా రాయిపాడు వద్ద విద్యుత్ తీగలు తగిలి మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన డ్రైవర్లు, కరెంటు లైన్‌మెన్‌కు సమాచారం అందించి కరెంటు నిలిపివేయించారు. దీంతో ప్రమాదం తప్పింది.

యువతి అదృశ్యం

చింతకాని: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువతి కనిపించకుండా పోయిన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన సదరు యువతి తిరిగి రాకపోవటంతో యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ షేక్ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174

ఇఫ్తార్ విందు..బందేనా ?


ఖమ్మంలో ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలు

- ఈ సారి రంజాన్ తోఫా కూడా లేదు
- కనిపించని రాజకీయ సందడి
- ఇంకా ఏడురోజులే..

సత్తుపల్లి : రంజాన్ మాసం వచ్చిందంటే మసీదుల వద్ద ఇఫ్తార్ విందుల సందడి నెలకొంటుంది. ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడమనేది రాజకీయ పార్టీల వారు ఆనవాయితీగా భావిస్తారు. ప్రతి సంవత్సరం అధికార, ప్రతిపక్ష పార్టీలు ఇఫ్తార్ విందు ఇచ్చేందుకు పోటీ పడేవి. ఇఫ్తార్ విందుకు హాజరైన నేతలు.. ముస్లింలకు ఖర్జూరం తినిపిస్తూ ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపేవారు. ఘుమఘుమలాడే మాంసాహార వంటకాలతో విందు భోజనం తినిపించేవారు. అదొక పుణ్యకార్యంలా దగ్గరుండి పర్యవేక్షించేవారు. అయితే ఈ ఏడాది అలాంటి సందడే కనిపించడం లేదు.

ఖమ్మంలో మాత్రమే హడావిడి..

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇఫ్తార్ విందులకు ప్రాధాన్యత ఏర్పడింది. రాజకీయ పార్టీలు ముస్లింలను ప్రసన్నం చేసుకునేందుకు ఇఫ్తార్ విందులను వేదికగా చేసుకుంటారు. ఎన్నికల సమయంలో పోటాపోటీగా ఇచ్చే ఇఫ్తార్ విందులు ఈ సారి ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రమే కొంతమేర కనిపిస్తున్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అక్కడక్కడా పాల్గొనడం మినహా ఇతర నియోజకవర్గాల్లో ఎక్కడా రాజకీయ నేతలు కనిపించడం లేదు. రంజాన్ ఉపవాసాలకు ఇంకా ఏడు రోజులే సమయం ఉండగా ఈ సారి రాజకీయ పార్టీల ఇఫ్తార్ విందులు లేనట్లేనని చర్చించుకుంటున్నారు. ఇక పోతే ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ అయితే ఓటమి నుంచి ఇంకా కోలుకున్నట్లు లేదు. ఖమ్మం, సత్తుపల్లి నియోజకవర్గాల్లో ఇఫ్తార్ విందులతో సందడి చేసే ఆ పార్టీ నాయకులు ఈసారి దూరంగా ఉంటున్నట్లు కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

రంజాన్ తోఫా కూడా లేదు..

ప్రతి ఏడాది ముస్లింలకు రంజాన్ తోఫా కింద ప్రభుత్వం ఒక చీర, పంజాబీ డ్రెస్, లాల్చీ, పైజామా అందించేది. ఈ సారి అది కూడా ఇవ్వడం లేదు. నూతన వస్త్రాలు వస్తాయనే ఆశతో పేద ముస్లింలు మసీదుల చుట్టూ తిరిగి నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఈ సారి కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తెలిసింది.

ప్రతి ఏడాది ఇఫ్తార్‌లతో..

తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ప్రతిఏటా రంజాన్ మాసంలో ప్రభుత్వం తరుపున ఇఫ్తార్ విందులు ఇవ్వటం ఆనవాయితీగా వస్తోంది. కరోనా ఆంక్షలప్పుడు మినహా మిగిలిన సంవత్సరాల్లో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేశారు. ముస్లిం జనాభా ఆధారంగా ప్రతి నియోజకవర్గానికి మూడుచోట్ల ఈ విందులు ఏర్పాటు చేసేవారు. ఖమ్మం నియోజకవర్గానికి రూ.5 లక్షలు, మిగిలిన నియోజకవర్గాలకు రూ.3 లక్షలు చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసేది. దీంతో ప్రభుత్వం ఇస్తున్న ఇఫ్తార్ విందులకు ముస్లింలు రాజకీయాలకు అతీతంగా అందరూ హాజరయ్యేవారు.

ఇఫ్తార్ విందులు ఇవ్వడం లేదు



ప్రభుత్వం తరఫున, రాజకీయ పార్టీల వారు ఈసారి ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఇఫ్తార్ విందు ఇవ్వలేదు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అడ్డంకి వస్తుందనే ఉద్దేశంతో ఇవ్వడం లేదని తెలిసింది. ప్రతి ఏడాది ప్రభుత్వం నుంచి సత్తుపల్లి నియోజకవర్గానికి రూ.3 లక్షలు ప్రభుత్వం విడుదల చేసేది. దీంతో నియోజకవర్గంలో మూడుచోట్ల ఇఫ్తార్ విందులు పెట్టేవాళ్లం.

– ఎండీ ముకరం హుస్సేన్, జామెమసీద్ సదర్, సత్తుపల్లి

మేమే ఏర్పాటు చేసుకుంటున్నాం



రాజకీయ పార్టీలు ఇఫ్తార్ విందులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఎన్నికలు ఉన్నా.. లేకున్నా సత్తుపల్లి ప్రాంతంలో రాజకీయాలకు అతీతంగా ఇఫ్తార్ విందులు ఇచ్చేవారు. ఈ సారి ఆ సందడి కన్పించలేదు. అయితే మేమే సొంత డబ్బులతో మసీదుల్లో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసుకుంటున్నాం.

– ఎస్‌కే రఫీ, జామెమసీద్ మాజీ సదర్, సత్తుపల్లి

వేసవి సెలవుల్లోగా మరమ్మతులు చేయండి..



హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశం..

సూపర్‌బజార్(కొత్తగూడెం): వేసవి సెలవులు పూర్తయ్యే నాటికి జిల్లాలోని ఆయా పాఠశాలల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. నూతనంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు, పనులు చేయించే విధానంపై బుధవారం కలెక్టరేట్‌లో నీటిపారుదల, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, మున్సిపల్, పీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఈఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 697 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు ద్వారా మంజూరైన పనులన్నింటినీ అంచనా వేసి అన్ని శాఖలు సమన్వయంతో ప్రణాళికలను సిద్ధం చేసి అందించాలన్నారు. కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో తాగునీరు, తరగతి గదుల్లో చిన్న చిన్న మరమ్మతులు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తదితర సమస్యలను గుర్తించి పనులు పూర్తి చేయాలని సూచించారు. మే 31లోగా మంజూరైన ప్రతిపని పూర్తి చేయాలని చెప్పారు. పని మొదలు పెట్టే ముందు, పూర్తయిన తరువాత ఫొటోలను అప్‌లోడ్ చేయాలని, జాతీయ బ్యాంకుల్లో కమిటీలతో ఖాతాలు తెరిపించాలని పేర్కొన్నారు. వీసీలో డీఆర్‌డీఓ విద్యాచందన, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఓ వెంకటేశ్వరాచారి, ఆర్‌అండ్‌బీ డీఈ నాగేశ్వరరావు, మున్సిపల్ డీఈ రవికుమార్, మెప్మా పీడీ రాజేశ్, సెర్ప్ డీపీఎం నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో రాజకీయ పార్టీలు సహకరించాలి

జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సక్రమంగా పాటిస్తూ సహకరించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఈవీఎం మొదటిదశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని చెప్పారు. ఓటర్లను మద్యం, డబ్బులతో ప్రలోభాలకు గురిచేస్తే సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదుదారుడి వివరాలు గోప్యంగా ఉంటాయని, 100 నిమిషాల్లో ఎన్నికల అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్లు ధారా ప్రసాద్, రంగప్రసాద్, ఎస్‌ఐసీ సుశీల, ఎలక్షన్ సిబ్బంది నవీన్, పలు పార్టీల నాయకులు రాంబాబు, నోముల రమేశ్, ఎర్రా కామేశ్, నాగేశ్వరరావు, లక్ష్మణ్ అగర్వాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనతోనే అభివృద్ధి

మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్, పక్కన ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్: కాంగ్రెస్ పాలనతోనే అభివృద్ధి సాధ్యమని మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ పేర్కొన్నారు. బుధవారం మణుగూరులోని డీపీ గ్రాండ్ హాల్‌లో పినపాక నియోజకవర్గ కో–ఆర్డినేటర్ కాటబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కలిసి మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో అక్రమాలకు పాల్పడి రూ.7 లక్షల కోట్ల అప్పు చేశారని ఆరోపించారు. తాను గతంలో ఎంపీగా ఉన్నప్పుడు పినపాక, భద్రాచలం నియోజవర్గాల్లో రూ.కోట్ల నిధులతో రహదారి సౌకర్యం కల్పించానని, మణుగూరుకు అదనపు రైలు సౌకర్యం తన హయాంలోనే వచ్చిందని వివరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు పులుసుబొంత, సీతమ్మసాగర్, వట్టి వాగు తదితర సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, పార్లమెంట్ ఎన్నికల అనంతరం సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పటికే రూ.10 కోట్లతో మారుమూల గ్రామాలకు లింక్ రోడ్లు నిర్మిస్తున్నట్లు, రూ.20 కోట్లతో మున్సిపాలిటీ సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎంపీగా బలరాంనాయక్‌ను గెలిపించుకుంటే మరింత అభివృద్ధి సాధించవచ్చని అన్నారు. ఈ నెల 6న తుక్కుగూడలో జరిగే భారీ బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు పీరినాకి నవీన్, గొడిశాల రామనాథం, ఓరుగంటి భిక్షమయ్య, సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, దుర్గంపూడి కృష్ణారెడ్డి, పాయం రామనర్సయ్య, శివ సైదులు, నియోజకవర్గ యువజన విభాగం ఉపాధ్యక్షుడు కొర్సా ఆనంద్, అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత, మణుగూరు వైస్ ఎంపీపీ కేవీరావు, భద్రాద్రి జిల్లా కార్మిక శాఖ మహిళా అధ్యక్షురాలు భోగినేని వరలక్ష్మి, తుక్కాని మధుసూదన్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు బషీరుద్దీన్, సామా శ్రీనివాసరెడ్డి, గాండ్ల సురేశ్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

బూర్గంపాడు: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని కేంద్ర మాజీ మంత్రి, మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరామ్ నాయక్ అన్నారు. జ్వరంతో బాధపడుతున్న మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బట్టా విజయ్‌గాంధీని బుధవారం ఆయన పోలవరం గ్రామంలో పరామర్శించి మాట్లాడారు. కేంద్రంలో కూడా కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువస్తే ఇందిరమ్మ రాజ్యం లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరుతాయన్నారు. అనంతరం బలరామ్ నాయక్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు.

తప్పుడు ప్రకటన ముద్రించిన కంపెనీపై కేసు


తనిఖీ చేస్తున్న జిల్లా ఔషధ నియంత్రణ అధికారి సంపత్‌కుమార్

పాల్వంచ: ఓ హోమియోపతిక్ స్టోర్స్‌లో తనిఖీ చేయగా తప్పుడు ప్రకటన ముద్రించినట్లు తేలడంతో కేసు నమోదు చేశారు. బుధవారం పట్టణంలోని హోమియో పతిక్ స్టోర్స్‌ను జిల్లా ఔషధ నియంత్రణ అధికారి సీహెచ్ సంపత్‌కుమార్ తనిఖీ చేశారు. ఓ మందు లేబుల్‌పై టైఫాయిడ్ జ్వరాన్ని నివారిస్తుందని ప్రకటన ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఔషధాలు, నివారణలు అభ్యంతర ప్రకటనల చట్టం 1954 ప్రకారం హరియాణాకు చెందిన బయోసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

అశ్వారావుపేటరూరల్: ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. అదనపు ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని దబ్బతోగు గ్రామానికి చెందిన మడకం గంగరాజు తన కుటుంబీకులతో ఓ విషయంపై గొడవపడి మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, మిత్రుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో గంగరాజు అన్నయ్య మడకం బాబూరావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

సీహెచ్‌సీ ఎంఎన్‌ఓ దురుసు ప్రవర్తన..

ఆస్పత్రికి వచ్చిన పేషంట్‌ను దూషించిన వైనం..


ఆస్పత్రి బయటే ఉన్న పేషంట్ తరఫు వ్యక్తులు

అశ్వారావుపేట: అశ్వారావుపేట సీహెచ్‌సీని ప్రధాన రింగ్‌సెంటర్ నుంచి కెమిలాయిడ్స్ వద్దకు మార్చినప్పటి నుంచి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా సోమవారం రాత్రి జరిగిన ఓ ఘటన ఈ ఆరోపణలకు బలాన్నిస్తోంది. అవినీతి ఆరోపణలు.. పోస్టుమార్టానికి లంచం అడగడం.. నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి ఆరోపణలు వాస్తవమేనన్నట్లుగా సిబ్బంది వ్యవహరిస్తున్నారు. అశ్వారావుపేట కన్యకాపరమేశ్వరి ఆలయం వీధికి చెందిన ఓ వ్యక్తి మద్యం సేవించి ఇంట్లో వాళ్లను బెదిరించడం కోసం ముఖానికి కోడి పేల మందు రాసుకున్నాడు. కానీ, తాను పేలమందు తాగానని ఇంట్లో వాళ్లకు చెప్పడంతో ఆందోళన చెంది తెలిసిన వారితో అశ్వారావుపేట సీహెచ్‌సీకి పంపించారు. సుమారు 10.30 గంటలకు ఆస్పత్రికి చేరుకున్న బాధితుడు, అతడి సహాయకుడు జరిగిన విషయాన్ని చెప్పారు. పేల మందు తాగినా.. తాగకున్నా.. వైద్యం ఒకే విధంగా ఉంటుందని.. తాగకుంటే చెప్పాలని వైద్య సిబ్బంది సూచించారు. తన వెంట వచ్చిన వ్యక్తి కూడా ఇదే విషయాన్ని అతనితో చర్చిస్తుండగా ఎంఎన్‌ఓ సాంబ అక్కడకు వచ్చి వైద్యం చేయాలా..? వద్దా.. ? లేకుంటే ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లిపోండి.. అంటూ కేకలు వేశాడని బాధితులు ఆరోపిస్తున్నారు. పరుష పదజాలంతో దూషిస్తూ రోగి తరఫు వ్యక్తులపై గొడవకు దిగినట్లు సమాచారం. ఈ క్రమంలో రోగి తరఫు బంధువులకు, ఎంఎన్‌ఓకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎంఎన్‌ఓ దూషిస్తున్న విధానాన్ని వీడియో తీయబోయిన వ్యక్తి చేతిపై కొట్టడంతో సెల్‌ఫోన్ కిందపడిపోయింది. దాదాపు అరగంట సేపు రోగిని ఆస్పత్రిలోకి రానీయకుండా బయట మెట్లమీదే కూర్చోబెట్టాడని ఆరోపిస్తున్నారు. ఈలోగా అక్కడకు చేరుకున్న విలేకరిపైనా రెచ్చిపోయిన కోపంతో ఊగిపోయాడు. 'ఏం చేస్తావో చేసుకో.. ఎవడైనా సరే నా పద్ధతి ఇంతే..' అంటూ కేకలు వేశాడు. ఉద్రిక్త పరిస్థితి నెలకొంటుండటంతో స్టాఫ్‌నర్స్ ప్రమీల డయల్ 100కు ఫోన్ చేయగా ఏఎస్‌ఐ పెద్ద వెంకటేశ్వరరావు ఆస్పత్రికి వచ్చి.. ఎస్ఎంఓ, రోగి తరఫు బంధువులను సముదాయించారు. వైద్యరంగంలో ఉన్నవారు శాంతంగా ఉండాలని.. రోగులు, వారి సంబంధీకులపై దురుసుగా ప్రవర్తించొద్దని సూచించారు.

పరారైన రోగి..

అయితే, ఎంఎన్ఓ సాంబ కేకలకు భయభ్రాంతుడైన వ్యక్తి తన కొద్దీ వైద్యం అంటూ పరారయ్యాడు. నిజంగా క్రిమిసంహారకమందు సేవించిన వ్యక్తి వచ్చినా.. ఇలాంటి సిబ్బంది ఉంటే పారిపోతారని అక్కడికి వచ్చినవారు చర్చించుకుంటున్నారు. అత్యవసర వైద్యం అందాల్సినవారు వచ్చినప్పుడు ప్రాణాలకు ఎవరు బాధ్యులనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అశ్వారావుపేట సీహెచ్‌సీలో సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడేలా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా, ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా ఆస్పత్రికి వచ్చిన వారితో మర్యాదగా మెలగాల్సిన బాధ్యత అందరికీ ఉందన్నారు. సిబ్బంది పనితీరు మార్చుకునేలా చర్యలు చేపడుతామని చెప్పారు.

స్విట్జర్లాండ్ కంపెనీలతో 'శ్రీచైతన్య' ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

ఖమ్మంరూరల్: మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం.. స్విట్జర్లాండ్, జర్మనీ దేశాలకు చెందిన 'ఫ్యాక్టర్ వై' కంపెనీతో అవగాహనా ఒప్పందం చేసేకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం కళాశాలలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కళాశాలలో ఐపీ క్వాలిటీ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నామని, విద్యార్థులకు, అధ్యాపకులకు ఆవిష్కరణలకు అవసరమైన ఆర్థిక తోడ్పాటుతో పాటు నూతన పరిశ్రమల స్థాపనకు మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు. ఇక్కడి విద్యార్థుల నూతన ఆవిష్కరణలకు అంర్జాతీయస్థాయి పేటెంట్‌కు ఈ సంస్థ ఎంతో తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీల సీఈఓ, కళాశాల యాజమాన్యం పరస్పరం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఫిలిప్ అస్యూమ్స్, పుట్ట శ్రీనివాస్, రాజేశ్, వి.సుదర్శన్ పాల్గొన్నారు.

230 కిలోల గంజాయి దహనం

ఖమ్మంక్రైం: వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని సీపీ సునీల్‌దత్ నేతృత్వంలో బుధవారం దహనం చేశారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సీజ్ చేసిన 230 కిలోల ఎండు గంజాయిని సీపీ పర్యవేక్షణలో పోలీస్ ఫైరింగ్ రేంజ్ మంచుకొండ అటవీ ప్రాంతంలో నిర్వీర్యం చేశారు. ఖమ్మం వన్‌టౌన్, తల్లాడ, వైరా పోలీస్ స్టేషన్లకు సంబంధించిన 13 కేసుల్లో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు జరిపిన నిందితులను అరెస్ట్ చేసినట్లు అడిషనల్ డీసీపీ నరేశ్‌కుమార్ తెలిపారు. ఠాణాల్లో నిల్వ ఉన్న గంజాయిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గెజిట్ నోటిఫికేషన్ల ఆధారంగా, పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్వీర్యం చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేశ్‌కుమార్, ఏసీపీలు సాంబరాజు, మల్లయ్య, సీఐలు స్వామి, శ్రీహరి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో చోరీ నిందితురాలు

నేలకొండపల్లి: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ వద్ద నుంచి బంగారం చోరీ చేసిన నిందితురాలిని స్థానిక పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన శెట్టి కమలమ్మ గత నెల 22న ఆర్టీసీ బస్సులో కోదాడ నుంచి ఖమ్మం వస్తోంది. ఆమె పక్కనే మరో ప్రయాణికురాలు కూర్చుంది. టికెట్ కోసం ఆధార్‌కార్డును తీసి, బంగారం ఉన్న చిన్నపర్సును చేతితో పట్టుకుని, టికెట్ తీసుకున్నాక పర్సును బ్యాగులో పెట్టింది. నేలకొండపల్లిలో మహిళ దిగిన తరువాత అనుమానంతో కమలమ్మ బ్యాగ్ చూసుకుంది. అందులో పర్స్ ఉంది కానీ, బంగారం కనిపించలేదు. బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితురాలిని గుర్తించారు. బుధవారం రాత్రి ఏపీకి చెందిన సదరు మహిళను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కామేపల్లి: మండలంలోని సాతానిగూడెం గ్రామానికి చెందిన నల్లపాటి రామనాథం(55) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. రామనాథం మద్యానికి బానిసయ్యాడు. భార్య కోటమ్మ వారం కిందట మందలించడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా బుధవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆగని ఇసుక దందా..

సీఐ హెచ్చరికలు బేఖాతర్


చిన్నంశెట్టిబజారులో ఇసుక అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

అశ్వారావుపేట: 'కాసులు కురిపిస్తున్న ఇసుక' శీర్షికన 'సాక్షి'లో మార్చి 23న కథనం ప్రచురితమైంది. స్పందించిన రెవెన్యూ, పోలీస్ సిబ్బంది అక్రమ ఇసుక నిల్వలను సీజ్ చేశారు. అదే రోజు సీఐ జితేందర్‌రెడ్డి ఇసుక అక్రమ వ్యాపారులను తన కార్యాలయానికి పిలిపించి దందా ఆపాలంటూ హెచ్చరించారు. అయినప్పటికీ శనివారం రాత్రి అశ్వారావుపేట చిన్నంశెట్టి బజారులో ఇసుక లారీతో ఏపీ నుంచి అక్రమంగా రప్పించి అన్‌లోడ్ చేశాడో ఇసుక వ్యాపారి. 'పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఆపుతున్నారు. వాళ్లకు ఫార్మాలిటీస్ ఇవ్వాలి.. విలేకరులు వార్తలు రాస్తున్నారు.. చాలా కష్టంగా ఉంది ఇసుక రావాలంటే' అంటూ ధరలను అమాంతం పెంచేసి సొమ్ము చేసుకుంటున్నారు. వీరికి సంబంధిత శాఖల సిబ్బంది సహకారాలున్నట్లు తెలుస్తోంది. ఇంత దర్జాగా అక్రమ వ్యాపారం చేస్తున్నారంటే రాత్రిళ్లు గస్తీ తిరిగే పోలీసుల కళ్లబడకుండా ఉంటారా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయాన్ని అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా తాను మరోసారి అందరికీ గట్టిగా హెచ్చరికలు జారీ చేస్తానని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గోవింద్‌పూర్‌కు అధికారులు

గ్రామస్తులతో మాట్లాడి వివరాల సేకరణ

- నివాస ప్రదేశంలో తాగునీటి వసతి కల్పించేందుకు చర్యలు


కొత్త గ్రామంలో వసతులను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

తాంసి: కిడ్నీ వ్యాధితో ఉన్న ఊరిని వదిలివెళ్లిన ఆ గిరిజనుల గోసను కళ్లకు కట్టేలా వివరించిన 'సాక్షి'కథనం అధికార యంత్రాంగాన్ని కదిలించింది. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం కమట్‌వాడ జీపీ పరిధిలోని గోవింద్‌పూర్ గిరిజన గ్రామాన్ని అధికారులు బుధవారం సందర్శించారు. 'కిడ్నీ వ్యాధితో ఊరు ఖాళీ'శీర్షికన సాక్షి మెయిన్‌లో కథనం ప్రచురితమైంది. కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాన్ని సందర్శించి పలు వివరాలు సేకరించారు. డీఎల్‌పీఓ ఫణిందర్‌తో పాటు ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ తదితరులు గిరిజనులు విడిచి వెళ్లిన గ్రామాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న వసతులతో పాటు తాగునీటికి గ్రామస్తులు ఉపయోగించిన చేతిపంపులను పరిశీలించారు. గ్రామాన్ని విడిచి వెళ్లడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం నివా సం ఉన్న ప్రదేశంలో తాగునీరు, ఇతర అవసరాల కు ఏ నీటిని ఉపయోగిస్తున్నారని అడగ్గా, తాగేందుకు పక్కన ఉన్న ధనోరా నుంచి ఆటో ద్వారా మినరల్ వాటర్ తెప్పించుకుంటున్నామని చెప్పారు. ఇతర అవసరాలకు పక్కన ఉన్న వ్యవసాయబావి నీటిని వాడుకుంటున్నామన్నారు. ఆ బావిలోని నీటిని అధికారులు పరిశీలించారు. శాంపిళ్లు సేకరించి పరీక్ష చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి డీఎల్‌పీఓ సూచించారు. ప్రస్తుతమున్న చోట ట్యాంక్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. కలెక్టర్‌కు విన్నవించి ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు.

వైద్యశిబిరం ఏర్పాటు

భీంపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి నిఖిల్‌రాజ్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేశారు. కిడ్నీతో పాటు ఇతర వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. కిడ్నీ సంబంధ వ్యాధికి గల కారణాలు తెలుసుకునేందుకు త్వరలోనే మరో క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు.


పరిశ్రమలో రియాక్టర్ పేలటంతో కమ్ముకున్న పొగ



ఎస్‌బీ ఆర్గానిక్ పరిశ్రమ వద్ద గుమిగూడిన గ్రామస్తులు, ఉద్యోగులు


ఎస్‌బీ పరిశ్రమను పరిశీలిస్తున్న మంత్రి కొండా సురేఖ

రసాయన పరిశ్రమలో పేలిన రియాక్టర్

ఘోర ప్రమాదంలో పరిశ్రమ యజమాని సహా ఐదుగురు మృత్యువాత

- 30 మందికి పైగా కార్మికులకు గాయాలు.. ఏడుగురి పరిస్థితి విషమం
- మృతులు వివిధ రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తింపు
- సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్‌లో ఘటన

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/ హత్నూర/ సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్‌లో ఉన్న ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. పరిశ్రమలో ఉన్న ఆయిల్ రియాక్టర్ బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా పేలిపోయింది. దీంతో అగ్నికీలల్లో చిక్కుకుని పరిశ్రమ యజమానుల్లో ఒకరైన హైదరాబాద్‌కు చెందిన రవి (45), ఆంధ్రప్రదేశ్, తమిళనాడులకు చెందిన ప్రొడక్షన్ ఆఫీసర్లు సుబ్రహ్మణ్యం (36), దయానంద్ (48), మధ్యప్రదేశ్‌కు చెందిన మెయింటెనెన్స్ ఇన్‌చార్జి సురేష్ పాల్ (45) సజీవ దహనమయ్యారు. చందాపూర్ గ్రామానికి చెందిన కార్మికుడు చాకలి విష్ణు (35) హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ప్రమాదంలో మొత్తం ఐదుగురు మరణించారని సుమారు 30 మందికి పైగా కార్మికులు తీవ్రంగా గాయపడినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి బుధవారం రాత్రి ప్రకటించారు. గాయపడిన వారిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, స్థానిక ఎంఎన్ఆర్ ఆసుపత్రికి, హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రులకు తరలించినట్లు తెలిపారు. గాయపడిన వారిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహలు, జిల్లా ఎస్పీ రూపేష్, వివిధ శాఖల అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించారు.


రవివర్మ


విష్ణు

పేలుడు ధాటికి కంపించిన భూమి

ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో సుమారు 200 మంది వరకు షిఫ్టుల వారీగా పనిచేస్తున్నారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో సుమారు 60 మంది కార్మికులు విధుల్లో ఉండగా పెద్ద శబ్దంతో రియాక్టర్ పేలింది. పేలుడు ధాటికి పరిశ్రమలో ఉన్నవారు ఎగిరి కొన్ని మీటర్ల దూరంలో చెల్లాచెదురుగా పడిపోయారు. మంటల్లో కాలి మరణించినవారు, తీవ్రంగా గాయపడిన వారితో భీతావహ పరిస్థితి నెలకొంది. బాధితుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఆవరణంతా దట్టమైన పొగ అలుముకుంది. పరిశ్రమతో పాటు, చుట్టుపక్కల ఉన్న భవనాలు ధ్వంసమయ్యాయి. సుమారు ఐదు కిలోమీటర్ల దూరం వరకు భూమి కంపించడం, ఇంటి పైకప్పులు సైతం ఎగిరిపోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. రెడ్డిఖానాపూర్‌లో భూమి కంపించిందని కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం మల్లుపల్లికి చెందిన నారాయణ తెలిపారు.

కార్మికుల కుటుంబాల ఆందోళన

పేలుడుతో అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. చెలరేగిన మంటలు రెండో రియాక్టర్‌కు కూడా అంటుకోవడంతో అది కూడా పేలుతుందని అధికారులు భయపడ్డారు. ముందు జాగ్రత్తగా చుట్టుపక్కల వారందరినీ అక్కడి నుంచి తరలించారు. పరిశ్రమ ఎదుట కార్మికుల కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళన నిర్వహించారు. రాత్రి తొమ్మిది గంటల తర్వాత మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పరిశ్రమను పరిశీలించిన మంత్రులు

మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహలు కూడా ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిశ్రమను పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని, బాధితులకు మెరుగైన చికిత్స అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలతో పాటు, గాయపడిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని కొండా సురేఖ హామీ ఇచ్చారు. పరిశ్రమల్లో భద్రత చర్యలు చేపట్టకపోవడం వల్లే ప్రమాదాలు సంభవించినప్పుడు కార్మికులు మరణిస్తున్నారని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. అనంతరం ఎంఎన్ఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దిలీప్‌రెడ్డి, శ్రీనివాస్, మస్తానయ్య, పూడి కుమార్‌రెడ్డి, సీహెచ్ భాస్కర్, సాయికుమార్, ధన్‌రాజ్, మాధవరావు ,అజయ్ పరిహార్, మాధవ్ సింగ్, అశోక్ సింగ్ , రాజేష్, నరసింహులు, ఉద్ధవ్, మల్లేశంలను మంత్రి పరామర్శించారు.

ప్రముఖుల దిగ్భ్రాంతి

ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు మరణించడంపై రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ యంత్రాంగానికి సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాల్సిందిగా ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డిని ఆదేశించారు. కాగా మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలియజేశారు. తీవ్రంగా గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలం చెల్లిన రియాక్టర్!

పరిశ్రమల శాఖ ప్రాథమిక నిర్ధారణ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో పేలిపోయిన రియాక్టర్ కాలం చెల్లినదిగా పరిశ్రమల శాఖ వర్గాలు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఈ కారణంగానే రియాక్టర్ నుంచి ఆయిల్ లీకేజీ జరిగి అగ్ని ప్రమాదానికి దారితీసిందని, రియాక్టర్ పేలిపోయిందని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. కాగా ప్రమాదంపై ప్రాథమిక విచారణ ప్రారంభించామని, ఇప్పుడే ఏమీ చెప్పలేమని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇలావుండగా పరిశ్రమలో మొత్తం మూడు యూనిట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. యూనిట్ -1లో ప్రమాదం జరిగింది. ఇందులో గైనిడైన్ నైట్రేట్, గైనిడైట్ కార్బొనేట్ తయారవుతుందని అధికారులు తెలిపారు. ఇవి పేలుడు పదార్థాలకు సంబంధించిన ఉత్పత్తులని వివరించారు. మిగతా రెండు యూనిట్లలో బల్క్‌డ్రగ్స్ తయారవుతాయని పేర్కొన్నారు.

కొత్త రుణాలు కావాలా.. పాత అప్పు కట్టండి

రైతులకు తేల్చి చెప్తున్న బ్యాంకులు ● మౌఖిక ఒత్తిళ్లు.. లీగల్ నోటీసులు సైతం జారీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులకు రుణాలు ఇచ్చిన బ్యాంకులు వారి ముక్కుపిండి మరీ తిరిగి వసూలు చేస్తున్నాయి. లీగల్ నోటీసులు, మౌఖిక ఆదేశాలు, ఒత్తిళ్లతో వడ్డీతో సహా రాబట్టుకుంటున్నా యి. కొన్ని బ్యాంకులు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఎంతో కొంత తగ్గించి వసూలు చేస్తున్నాయి. కొత్త రుణాలు కావాలంటే పాత అప్పు చెల్లించాల్సిందేనంటూ మెడపై కత్తి పెట్టినట్లుగా వ్యవహరిస్తున్నా యి. కొన్ని బ్యాంకులు రైతుల ఖాతాల్లోని రైతుబంధు సొమ్మును లాగేసుకుంటున్నాయి. దీంతో కొందరు రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు తెచ్చి మరీ బ్యాంకులకు చెల్లిస్తున్నారు. రుణమాఫీ జరుగుతుందనే ఆశతో అప్పులు తిరిగి చెల్లించలేదని, రుణమాఫీ జరగకపోగా వడ్డీ తడిచిమోపెడు అవుతోందని గగ్గోలు పెడుతున్నారు. రుణమాఫీ జరిగేవరకు వేచి చూడాలని వేడుకుంటున్నా బ్యాంకులు వినడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు బ్యాంకులు నోటీసులు..మరోవైపు వ్యవసాయశాఖ చేతులెత్తేయడం, రుణమాఫీ ఎప్పుడు జరుగుతుందో తెలియక, కొత్తగా అప్పు పుట్టే పరిస్థితి లేక రైతులు నలిగిపోతున్నారు.

ముందుకు సాగని రూ.2 లక్షల రుణమాఫీ

తమ పార్టీని గెలిపిస్తే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఇప్పుడదే పార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ నాలుగు నెలలైనా ఇప్పటివరకు రుణమాఫీకి సంబంధించిన ప్రక్రియ మొదలుకాలేదు. కనీసం మార్గదర్శకాలు కూడా ఖరారు చేయలేదు. కానీ రూ.2 లక్షల వరకు రుణాన్ని మాఫీ చేయాలంటే రూ.30 వేల కోట్లు అవసరమవుతాయని మాత్రం ప్రభుత్వం అంచనా వేసింది. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు.. ఎలా చేయాలి? ఏ తేదీ వరకు రుణమాఫీ చేయాలి అన్న అంశంపై తర్జనభర్జన పడుతున్నారు.

> "బ్యాంకుల్లో రైతు రుణాలు ఉన్నవాళ్లు ఎవ్వరూ కట్టకండి.. మేం అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తాం"
> అప్పట్లో పలు ఎన్నికల ప్రచార సభల్లో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి

ఇప్పట్లో సాధ్యం కాదా?

ఎన్నికల కోడ్‌తో ఇప్పటికిప్పుడు రుణమాఫీకి మార్గదర్శకాలు ఖరారు చేయడం, ఇతరత్రా ప్రక్రియ మొదలు పెట్టడం కానీ సాధ్యం కాదని అధికారులు అంటున్నారు. దీంతో జూన్ మొదటి వారం వరకు రుణమాఫీపై అడుగు ముందుకు పడే అవకాశం లేదు. మరోవైపు వానాకాలం సీజన్ జూన్ నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు మే నుంచే రైతులు సిద్ధం అవుతుంటారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం, త్వరగా వర్షాలు కురిస్తే దుక్కులు దున్నడానికి సన్నాహాలు చేసుకుంటుంటారు. ఇంకోవైపు ఏప్రిల్ నుంచే వానాకాలం సీజన్ పంట రుణాల ప్రక్రియను బ్యాంకులు ప్రారంభిస్తాయి. కానీ రుణమాఫీ జరగకుంటే కొత్త రుణాలు ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో అప్పులు తిరిగి చెల్లించాలని, రెన్యువల్ చేసుకోవాలని బ్యాంకులు నోటీసులు జారీ చేస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు.

ముందు చెల్లించండి.. తర్వాత సర్దుబాటు చేస్తాం

రాష్ట్రంలో ప్రతి ఏటా సగటున 42 లక్షల మంది వరకు రైతులు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకుంటారు. రుణం తీసుకున్న రైతులు మూడు సీజన్లలోగా బకాయిలు చెల్లిస్తేనే తదుపరి రుణం తీసుకోవడానికి అర్హులవుతారు. అయితే ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో రైతులు తమ బకాయిలను చెల్లించలేదు. మరోవైపు దీర్ఘకాలంగా బకాయిలు పేరుకుపోయిన వారు కూడా అవి చెల్లించలేదు. ఈ నేపథ్యంలో బ్యాంకులు చెప్పిన ప్రకారం పాత అప్పులు చెల్లించాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ప్రభుత్వం రుణమాఫీ నిధులు విడుదల చేశాక సర్దుబాటు చేస్తామని చెబుతున్నారు. రుణాలు రెన్యువల్ చేసుకోకపోతే రైతులు డిఫాల్టర్లుగా మారిపోతారు. అయితే కొన్ని బ్యాంకులు రైతుబంధు సొమ్మును జమ చేసుకోవడం ద్వారా రెన్యువల్ చేయడం గమనార్హం. కాగా తాము రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారమే నడుచుకుంటామని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకోవడం సాధ్యం కాదని ఒక బ్యాంకు అధికారి 'సాక్షి'కి చెప్పారు. బకాయిలు పేరుకుపోతే ఎవరినైనా డిఫాల్టర్లుగా ప్రకటిస్తామని అన్నారు. లక్షలాది మంది రైతుల రుణ బకాయిలు పేరుకుపోయి ఉన్నాయని, అందుకే నోటీసులు ఇస్తున్నామని స్పష్టం చేశారు. పాత రుణాన్ని అలాగే ఉంచి కొత్త రుణం ఇవ్వడం సాధ్యం కాదని వివరించారు.


జిల్లా వార్తలు

తాగునీటి సరఫరాకు ప్రత్యేకాధికారి నియామకం


సురేంద్రమోహన్

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్రంలో ఉన్న తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు నీరు సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రత్యేకాధికారులను నియమించింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ప్రత్యేక అధికారిగా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కె సురేంద్రమోహన్ (ఐఏఎస్)ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేకాధికారిగా నియమితులైన సురేంద్రమోహన్ వెంటనే జిల్లాకు చేరుకుని కలెక్టర్ వీపీ గౌతమ్‌తో, రాష్ట్ర అధికారులను సమన్వయం చేసుకుని జిల్లాలో తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని ప్రభుత్వం ఆదేశించింది. జూలై నెల వరకు ఇక్కడే ఉంటూ గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాలలో సైతం ప్రతి ఇంటికీ నీటి సరఫరా సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు జిల్లాలోనే ఉంటూ నీటి సమస్యపై దృష్టిపెట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సురేంద్రమోహన్ గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారిగా నియమించినట్లు తెలుస్తోంది.

టీటీ లీగ్ టోర్నీ విజేతలు వీరే..


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో బుధవారం జిల్లా స్థాయి లీగ్ టోర్నమెంట్ నిర్వహించారు. సీనియర్స్ బాలుర విభాగంలో విజేతలుగా పి.మోహిత్, గౌరిశెట్టి చర్విక్, పి.జ్యాలిత్, జూనియర్ విభాగంలో కె. హితేష్, ఎస్‌కే ఫైజుల్, ఎ.ఉజ్వల్ ఈ.హరి, సబ్ జూనియర్‌లో శ్రియాన్, ఎస్.దీక్షిత్, భవిక్, ఎ.చశ్వంత్, సీనియర్ బాలికల విభాగంలో బాలసాని హర్షిక, శాన్వి, సానితనైశ్రీ, జూనియర్ విభాగంలో బొంతు శివాని, పర్వవంశిక, అమృత, ఎస్.కె. జువేరియా, భవాని, ఆరాధ్య బి.యక్షిత విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవంలో డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా టీటీ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్, కార్యదర్శి సాంబమూర్తి, ఎంజీవీ ప్రవీణ్, కృష్ణసుమంత్, జంగా కార్తీక్, జోజీచాకో, శృతి, రాజేష్, కామేశ్వరి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

మిర్చి ధరపై 'బైడగి' దెబ్బ !

- రూ.13 వేలకే లభిస్తున్న కర్ణాటక బైడగి మిరప
- ఆయిల్ మిల్లులకు అక్కడి నుంచే దిగుమతి
- మిల్లర్ల కొనుగోళ్లు లేక తగ్గుతున్న స్థానిక మిర్చి ధర
- దిగులు చెందుతున్న రైతులు


ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం : తేజా మిర్చి ధరను కర్ణాటక బైడగి (5531 రెడ్) మిర్చి దెబ్బతీస్తోంది. తేజా మిర్చి ధర కంటే ఇది తక్కువ ధరకు లభిస్తుండటంతో మిర్చి ఆయిల్ మిల్లుల యాజమాన్యం ఆ మిర్చి కొనుగోళ్లకే ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో తేజా మిర్చికి డిమాండ్ పడిపోతోంది. తెలుగు రాష్ట్రాల్లో పండించే తేజా మిర్చికి దేశ విదేశాల్లో డిమాండ్ ఉంటుంది. తేజా మిర్చిని ఆయిల్ రూపలో ప్రధానంగా చైనా, ఉత్తర కొరియా, ఇండోనేషియా, మలేషియా, సింగపూర్, దుబాయ్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో వినియోగిస్తుంటారు. దీంతో ఈ మిర్చికి డిమాండ్ ఎక్కువ. విదేశాల్లో డిమాండ్ ఉన్న తేజా మిర్చి ఆధారంగా తెలుగు రాష్ట్రాల్లో ఆయిల్ మిల్లులను ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. తొలుత చైనా దేశస్తులు ఖమ్మం జిల్లాలోని ముదిగొండలో చెంగ్‌వాంగ్ బయోటెక్ పేరుతో మిల్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో పండించే తేజా మిర్చిని కొనుగోలు చేసి ఆయిల్‌గా మార్చి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. విదేశాల్లో ఈ ఆయిల్‌కు డిమాండ్ ఉండటంతో ఖమ్మం జిల్లాకు సరిహద్దుగా ఉన్న మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో విద్య హెర్బ్స్ పేరుతో, కురవి మండలం మన్నెగూడెం వద్ద ప్లాంట్ లిపిడ్స్ పేరిట మరో పరిశ్రమను నిర్వహిస్తున్నారు. ఖమ్మం జిల్లా పరిసర ప్రాంతాల్లో తేజా పంట సాగు అధికంగా ఉండటంతో ఈ ప్రాంతంలో మూడు పరిశ్రమలను నిర్వహిస్తున్నారు. ఖమ్మం సమీపంలోని కురవి మండలం ముల్కలపల్లి వద్ద కూడా మరో పరిశ్రమ నిర్మిస్తున్నారు. వీటితో పాటు హైదరాబాద్ నగర శివార్లలో ఒక పరిశ్రమ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో ఒక పరిశ్రమ నిర్వహిస్తున్నారు. దీంతో ఇక్కడ పండించే తేజా మిర్చికి డిమాండ్ ధర ఉండేది. ప్రస్తుతం బైడగి మిర్చి దాన్ని తలకిందులు చేసింది.

మిల్లులు దారి మళ్లడంతో..

మిర్చి ఆయిల్ మిల్లులు కర్ణాటక బైడగి పంట కొనుగోళ్లకు మళ్లడంతో 'తేజా' రకం మిర్చి ధరపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖమ్మం పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న మూడు ఆయిల్ మిల్లులు ప్రతి ఏటా 25 వేల టన్నుల మిర్చి కొనుగోళ్లు చేస్తాయి. ఈ మూడు మిల్లులు కూడా ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కేంద్రంగా మిర్చి కొనుగోలు చేసి పరిశ్రమలను నిర్వహిస్తుంటాయి. ఈ ఏడాది ఈ మిల్లులు మిర్చి కొనుగోళ్లకు ఖమ్మం మార్కెట్ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. కొద్ది రోజులుగా కర్ణాటక నుంచి నిత్యం 20 నుంచి 30 లారీలకు పైగా ఈ మిల్లులకు మిర్చి దిగుమతి అవుతోంది. ఏడాది పాటు మిల్లుల నిర్వహణకు సరిపడా మిర్చిని యాజమాన్యం దిగుమతి చేసుకుంటోంది.


ముదిగొండ చైనా మిల్లుకు క్యూ కట్టిన కర్ణాటక మిర్చి లారీలు

గణనీయంగా పడిపోయిన 'తేజా' ధర

మిర్చి ఆయిల్ మిల్లుల కొనుగోళ్లు లేకపోవటంతో 'తేజా' రకం మిర్చి ధర గణనీయంగా పడిపోయింది. ఇటీవల కాలంలో నాణ్యతా ప్రమాణాల ఆధారంగా రూ. 17 నుంచి రూ. 20 వేల వరకు కొనుగోళ్లు జరిగాయి. కర్ణాటక నుంచి బైడగి మిర్చి దిగుమతి ప్రారంభమైనప్పటి నుంచి సగటున రూ.16 వేల ధర పలుకుతోంది. నాణ్యత ఏ మాత్రం తక్కువగా ఉన్నా వ్యాపారులు రూ. 14 వేలకే అడుగుతున్నారు.

ధర లేక రైతుల దిగాలు..

మిర్చికి ధర లేకపోవడంతో రైతులు దిగులు పడుతున్నారు. ఖమ్మం మార్కెట్‌కు విక్రయానికి తీసుకొచ్చిన రైతులు ధర లభించక నిల్వకు మొగ్గు చూపుతున్నారు. కొందరు రైతులు తిరిగి ఇళ్లకు తీసుకుపోతుండగా, కొందరు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ పెడుతున్నారు. ఇదిలా ఉండగా కొందరు రైతు సంఘ ప్రతినిధులు కర్ణాటక నుంచి మిల్లులకు దిగిమతి అవుతున్న మిర్చి అంశంపై కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మిల్లర్లు ఖమ్మం మార్కెట్ నుంచి తేజా మిర్చిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ.13 వేలకే బైడగి మిర్చి..


కర్ణాటక రాష్ట్రంలో సాగు చేసే 5531 రెడ్ రకం బైడగి మిర్చి క్వింటా రూ. 12,500 నుంచి రూ. 13,500 వరకు లభిస్తుంది. వ్యాపారులు కర్ణాటకలో రైతుల వద్ద రూ. 9,500 నుంచి రూ.10 వేల చొప్పున కొనుగోలు చేసి ఆర్డర్లపై ఇక్కడి మిర్చి మిల్లులకు సగటున రూ. 13,000 చొప్పున విక్రయిస్తున్నారు. దీంతో ఇక్కడ లభించే తేజా రకం మిర్చి కన్నా బైడగి మిర్చి ధర తక్కువగా ఉండటంతో మిల్లుల యజమానులు కర్ణాటక మిర్చి కొనుగోలుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనికి తోడు తేజా రకం మిర్చి కంటే బైడగి మిర్చి రంగు, ఆయిల్‌లో నాణ్యత అధికంగా ఉంటుందని మిల్లుల యజమానులు స్పష్టం చేస్తున్నారు. బైడగి మిర్చి నుంచి అన్ని రకాలుగా ప్రయోజాలు ఉండటంతో ఆ మిర్చి కొనుగోళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు యజమానులు స్పష్టం చేస్తున్నారు.

ధర లేక నిల్వ పెడుతున్నా



ఖమ్మం మార్కెట్‌కు 18 బస్తాల రెండో కోత మిర్చి విక్రయానికి తీసుకొచ్చా. క్వింటా రూ.14 వేలకు అడిగారు. మొదటి సారి 21 బస్తాలు విక్రయానికి తీసుకొస్తే రూ.18,300 ధర పలికింది. అంతకు మించి నాణ్యంగా ఉన్న మిర్చిని మాత్రం రూ.14 వేలకే అడిగారు. అమ్మడం ఇష్టం లేక కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ పెడుతున్నా.
– బాణోత్ బిక్కు, పోచారం, గార్ల మండలం, మహబూబాబాద్ జిల్లా

ధర బాగా పడిపోయింది



మొదటి కోత పంటను రూ.19 వేలకు విక్రయించా. ప్రస్తుతం రూ.16 వేలకు అడుగున్నారు. నాణ్యమైన మిర్చిని ఆ ధరకు విక్రయించటం ఇష్టం లేక 31 బస్తాల మిర్చిని కోల్డ్ స్టోరేజీలో నిల్వ పెడుతున్నా. వానాకాలం పంటల సాగు సమయానికి ధర వస్తుందని ఆశిస్తున్నా. కర్ణాటక నుంచి తక్కువ ధరకు మిర్చి వస్తుందని ఇక్కడ మిర్చికి ధర బాగా తగ్గించారు.
– భూక్యా రామోజీ, బచ్చోడు, తిరుమలాయపాలెం మండలం

సత్తుపల్లి అమ్మాయి.. స్పెయిన్ అబ్బాయి


పెళ్లి మండపంలో మార్క్ మన్‌సిల్లా, లావణ్య

మూడుముళ్లతో ఒక్కటైన జంట

సత్తుపల్లిటౌన్: వారి ప్రేమ ఖండాంతరాలు దాటి వివాహ బంధంతో ఏకమైంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన విద్యాభారతి కళాశాల డైరెక్టర్ మందడపు సత్యనారాయణ – సుజని దంపతుల కుమార్తె లావణ్య నాలుగేళ్లుగా స్పెయిన్ దేశంలోని బార్సిలోనలో ఓ కంపెనీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ రంగంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. ఆమెకు అదే కంపెనీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన స్పెయిన్ దేశానికి చెందిన మార్క్ మన్‌సిల్లాతో మూడేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారడంతో ఇరుపక్షాల తల్లిదండ్రులను పెళ్లికి ఒప్పించారు. సత్తుపల్లిలోని శ్రీసాయిబాలాజీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం అర్ధరాత్రి 12.53 నిమిషాలకు ఈ ప్రేమ జంట పెళ్లితో ఒకటయ్యారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

అశ్వాపురం: అశ్వాపురం మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన జంగం కొమరయ్య–లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు జంగం సాంబమూర్తి బుధవారం రూ.1,01,116 విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా సాంబమూర్తి కుటుంబ సభ్యులకు మాజీ సర్పంచ్ మద్రి మల్లారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. దాతలు మరింతగా ముందుకొచ్చి సాయం చేయాలని కోరారు.

చల్లచల్లగా.. భలే రుచిగా !





జిల్లా కేంద్రంలో తాటి ముంజలు అమ్మకాలు జోరందుకున్నాయి. వేసవిలో ఎండలు ముదురుతుండగానే... శరీరానికి చలువ చేసే ముంజలు వచ్చేశాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి కొందరు గౌడ కులస్తులు నేరుగా ముంజలను తీసుకొస్తుండగా.. ఇంకొన్ని చోట్ల ఇతరులు సైతం గౌడల నుంచి కొనుగోలు చేసి ఖమ్మం తెచ్చి అమ్ముతున్నారు. డజన్ రూ.100 చొప్పున వీటిని విక్రయిస్తుండగా.. ఎండాకాలంలో మాత్రమే లభించే ముంజల కొనుగోలుకు జనం ఆసక్తి కనబరుస్తున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం